మహిళల ఆర్థిక సాధికారతకు 'ఆసరా'

- మహారాణులుగా ఎదగాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం
- అన్ని రంగాల్లో మహిళలదే పైచేయి
- పేదోడిని కోటీశ్వరుడిని చేసే సత్తా సీఎం జగన్‌కే ఉంది
- ఆసరా సభలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల



ఆకివీడులో జరిగిన ఆసరా సభలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

ఆకివీడు: జనాభాలో సగభాగం కంటే అధికంగా ఉన్న మహిళామణులదే పైచేయిగా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, పేదోడిని కోటీశ్వరుడ్ని చేసే సత్తా సీఎం జగన్‌కే ఉందని వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆకివీడు మండల, పట్టణ స్థాయి ఆసరా కార్యక్రమాన్ని గురువారం స్థానిక అయిభీమవరం రహదారి ప్రాంతంలో నిర్వహించారు. ఆసరా సంబరాల కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. మండలంలోని అన్ని రహదారులూ మహిళలతో నిండి ఆకివీడు వైపు పయనమయ్యాయి. ఎండ తీవ్రతను లెక్క చేయకుండా మహిళలు నాయకుల ప్రసంగాల్ని శ్రద్ధగా విన్నారు. మహిళలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా ఉమాబాల మాట్లాడుతూ జగన్ సీఎం అయిన దగ్గర నుంచి మహిళలకు అన్ని రంగాల్లో ప్రముఖ స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో, సంక్షేమ పథకాల అమలులో చేస్తూ మహిళల్ని మహారాణులుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అడ్వకేట్‌గా పనిచేస్తున్న తనను నర్సాపురం పార్లమెంట్ సభ్యురాలుగా నియమిస్తూ సీఎం జగన్ మహిళగా, సామాజికంగా వెనుకబడిన కులానికి చెందిన తనను గుర్తించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీల అభివృద్ధికి, పేద వర్గాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ మాట తప్పని, మడం తిప్పని ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నాలుగున్నరేళ్లుగా మ్యానిఫెస్టోలోని 99 శాతం పథకాలను అమలుజేసిన సీఎం జగన్ ఒక్కడేనన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రగతికి ఆయన చేస్తున్న కృషిని పలు రాష్ట్రాల నాయకులు ప్రశంసిస్తున్నారన్నారు. పేదోడిని లక్షాధికారిని చేసిన సీఎం జగన్ మరో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి అయితే పేదోడు కోటీశ్వరుడ్ని చేస్తాడని నర్సింహరాజు చెప్పారు. అట్టడుగు, పేద వర్గాలుగా ఉన్న ప్రజల్ని నవరత్నాల సంక్షేమ పథకాలతో లక్షాధికారుల్ని చేశారన్నారు. ప్రతి కుటుంబంలో పేదలకు రూ.2 లక్షలు నుంచి రూ.10 లక్షల వరకు సహాయం అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదోడి బిడ్డల్ని ఉన్నత చదువులు చదివించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, పారిశ్రామిక వేత్తలుగా తయారయ్యేలా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలువురు పేదల బిడ్డలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యారన్నారు. రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లు కేటాయించి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, పచ్చ మీడియా చేస్తున్న దుష్ట ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. వలంటీర్ల సేవల్ని పొందుతున్న ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. మళ్లీ సీఎం జగన్ ఎందుకు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి, మీ బిడ్డల ఉన్నత స్థితిని గుర్తించి జగన్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), ఎంపీపీ కతారి జయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పశ్లెం అరుణకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అంబటి రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, శిరపు శ్రీనివాస్, గాలి సామ్రాజ్యం, నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆసరా కార్యక్రమం సందర్భంగా 8 వేల మందికి పైగా మహిళలకు భోజన వసతిని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో కొలువైయున్న శ్రీ బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ చినిమిల్లి వెంకటరామయ్య (బాబి) మాట్లాడుతూ 17 నెలలకు గానూ హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.లక్షా 66 వేల 200 వచ్చినట్లు చెప్పారు. ఆదాయ లెక్కింపును పర్యవేక్షించిన వారిలో గ్రామపెద్ద చినిమిల్లి నాగన్న, ధర్మకర్తలు పస్తుల రాంబాబు, చేకూరి రామకృష్ణంరాజు, చిప్పాడ రజిని, బండి రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10న ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబపురం గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారిని భక్తులు దర్శించి తరించాలని అమ్మవారి దేవస్థానం చైర్మన్ మాకా బాలాజీ కోరారు. నూతన ఆలయం ప్రతిష్ఠ జరిగి 4 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 10వ తేదీ శనివారం ఆలయం 5వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామ పారాయణం, కోలాట భజనలు ఉంటాయని వివరించారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం, మోదుగుంట, నవాబుపాలెం, ఆరుగొలను గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో గురువారం తణుకు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంవీ రమేష్ తనిఖీలు నిర్వహించారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని అలాగే స్టాకు, వాటి ధరల వివరాలను రైతులకు తెలిసేలా బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. భౌతిక విలువలతో సమానంగా ఉండాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓ ఫారం లేని ఎరువులను వాటి అమ్మకాలను నిలిపి వేశారు. సుమారు రూ.3,92,000 విలువ గల ఎరువుల అమ్మకాలను నిలిపి వేశామని తెలిపారు. వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఆర్‌ఎస్ ప్రసాద్, విస్తరణ అధికారి మాధవవర్మ ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. దివ్యాంగులకు అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ అభయం పనిచేస్తాయని క్లబ్ డైరెక్టర్ చిక్కాల భ్రమరాంబికా తెలిపారు. స్థానిక భవిత సెంటర్‌లో గురువారం దివ్యాంగులు, చిన్నారులకు బెడ్ షీట్స్, స్టేషనరీ, స్నాక్స్ పంపిణీ చేశారు. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, కుందం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, హెచ్‌ఎం జ్యోతి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

తణుకు: రక్తదానం సామాజిక బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. పట్టణానికి చెందిన డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన గురువారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో స్థానిక ఎంసీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, సొసైటీ చైర్మన్ మంతెన శివరామభద్రిరాజు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం



పెద కాపవరంలో పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: శివారు ప్రాంత ప్రజలతో సహా అన్ని గ్రామాలకూ రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పైప్‌లైన్ విస్తరణ పనులు చేపడుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని పెద కాపవరం గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టనున్న పైప్‌లైన్ పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జల జీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్ విస్తరణ పనులు, ఫిల్టర్‌బెడ్‌లు, సంప్‌లు, ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అన్ని గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంచినీటి చెరువుల్లో నీటిని పూర్తిగా నింపుకోవాలన్నారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కతారి జయలక్ష్మి, సర్పంచ్ ఊసల బేబీ స్నేహ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అన్యెం కృష్ణ, యూత్ అధ్యక్షుడు చిక్కాల చిన్నా, కతారి రామకృష్ణ, కేశవరావు, కట్రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన ఈనెల 18వ తేదీ వరకు 'రండి.. మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో రాష్ట్ర స్థాయి అవగాహన ఉద్యమాన్ని చేపట్టినట్లు ఉద్యమ పట్టణ కన్వీనర్ మొహమ్మద్ సిద్దీఖ్ తెలిపారు. గురువారం భీమవరంలో ఉద్యమం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్, కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం, రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ సభలు, వ్యాసరచన పోటీలు వంటివి నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేమని చెప్పారు. అనంతరం ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జమాతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్, ఎంఎం పాషా, ఇంతియాజ్, జానీ, ఉమైర్, ఇర్ఫాన్, నవీద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

భీమవరం: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను పూర్తిగా హరిస్తోందంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన గురువారం భీమవరం ప్రకాశం చౌక్‌లో ఆందోళన నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను తన పరిధిలోకి తెచ్చుకుని హక్కులకు భంగం కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులను ఇవ్వడం లేదని, ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతోందన్నారు. ప్రజలంతా బీజేపీ ఏకపక్ష విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, జేఎన్‌వీ గోపాలన్, మల్లుల సీతారాంప్రసాద్, బి.వాసుదేవరావు, మల్లిపూడి ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ తప్పనిసరి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఉండి: మనిషి కడుపులో ఉండే నులిపురుగులను నివారించుకోవాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయుల ఆధ్వర్యాన నులిపురుగుల నివారణ అవశ్యకతపై ఎంపీపీ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలబాలికలతో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా మింగించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం లేదా వారికి అందించడం చేస్తారని తెలిపారు. బాలబాలికలు వాటిని పారవేయకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు జాగ్రత్తగా వాటిని మింగించాలన్నారు. అప్పుడే వారి ఆరోగ్యం బాగుంటుందన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు



సుందర్ కుమార్‌ను సన్మానిస్తున్న దళిత నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఇటీవల పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన గంటా సుందర్ కుమార్‌ను గురువారం దళిత నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ సుందర్‌కుమార్ గత 35 ఏళ్లుగా దళిత ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రోత్సాహంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దళిత నాయకుడు, అడ్వకేట్ ఏలేటి న్యూటన్, రోక్కాల సామ్యేల్, మునవీర్, గాంధీ, కొరపాటి అనిత, అమ్మూలరావు, గొల్ల రాజ్‌కుమార్, పట్టెం శుభాకర్, గెద్దం జార్జ్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: రైతులు పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు సూచించారు. భీమవరం గూట్లపాడులో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్‌లు వేశారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వైరస్ జనవరి నుంచి ఏప్రిల్ వరకు సోకుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు కాళ్ల గిట్టలు విడిపోవడం, తీవ్ర జ్వరంతో బాధపడుతూ మేత తినడం నిలిపి వేయడం, పాల దిగుబడి తగ్గిపోవడం, పొదుగు వద్ద వాపు వస్తుందన్నారు. 45 ఆవులు, 125 గేదెలకు వ్యాక్సిన్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పశు పెంపకందారులు, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు మెండు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: క్రీడలు శరీరానికే కాక ఉపాధి అవకాశాలకు ఎంతగానో దోహదం చేస్తాయని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. డీఎన్నార్ లా కళాశాల 34వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యం చేకూరి ఉత్సాహంగా చదువుకుంటారని, అందువల్ల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ కె.రఘురామ్, జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, కె.రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ నర్సింహరాజు పాల్గొన్నారు.

వసతి గృహం ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికల వసతి గృహం ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి.సుజాతా రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీలోగా ఆయా స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ ధృవపత్రం, సభ్యుల వివరాలు, సంస్థ మూడేళ్లుగా చేస్తున్న సేవల వివరాలతో మూడు సెట్‌ల దరఖాస్తులను భీమవరంలోని కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఎలుకలను సామూహికంగా మట్టుబెట్టాలి



రాయలంలో పంట పొలంలో ఎలుకల బొరియలను మూస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పంట పొలాల్లో ఎలుకలను సామూహికంగా మట్టుపెట్టాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో గురువారం పంట చేలల్లో ఎలుకల బొరియలు మూసే కార్యక్రమం చేపట్టారు. ఏవో మాట్లాడుతూ వ్యవసాయంలో ఎలుకలను నిర్మూలించకపోతే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఆర్‌బీకేల్లో ఎలుకల మందు కలిపిన నూకలను రైతులకు పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎలుక బొరియలు పూడిక

ఆకివీడు: ఎలుక బొరియలను పూడ్చివేసి, మందు పెట్టేందుకు రైతులు సిద్ధంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ఎంఆర్‌పీ ప్రియాంక సూచించారు. ఆయా గ్రామాల్లోని ఎలుక బొరియలను పూడ్చివేసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమం ఈనెల 8, 9 తేదీల్లో కొనసాగుతుందన్నారు. 9వ తేదీన అన్ని ఆర్బీకే కేంద్రాల వద్ద ఎలుకల మందును అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రైతులు 96 పాళ్లు నూకలు, రెండు పాళ్లు చొప్పున నూనె, బ్రొమోడయోలిన్ మందును కలిపి ఎలుక బొరియల్లో వేసి పూడ్చి వేయాలన్నారు.

సామూహికంగా చేపట్టండి

ఉండి: రైతులంతా ఒకేసారి సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితేనే ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. ఉండిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ ఈనెల 9న శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల వద్ద చిన్నచిన్న పొట్లాలుగా కట్టి రైతులకు ఎలుకల మందును ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో సత్ఫలితాలు

పాలకోడేరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మోగల్లులోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా ఎలుకల మందు పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తొలుత చేల గట్లపై ఎలుకల బొరియలు గుర్తించడం, ముందు రోజున మట్టితో పూడ్చడం. తర్వాత రోజు వెలుగు చేయాలని రైతులకు సూచించారు. అందరూ సామూహికంగా ఒకేసారి చేస్తే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. భీమవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాస్, వ్యవసాయాధికారి వి.నారాయణ రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు సూర్యకృష్ణ, లావణ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

తణుకు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందించే సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు బూసి వినీత హెచ్చరించారు. తణుకు మండలం మండపాక, పైడిపర్రులోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రాల్లో పరిశుభ్రత, కిశోర బాలలకు అందుతున్న పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సీడీపీవో ప్రమోదిని పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఎదగనిద్దాం

పాలకోడేరు: ఆడపిల్లలను పుట్టనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం అనే నినాదంతో అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ సీహెచ్ పార్వతి తెలిపారు. ఆడపిల్లల విద్య, సంరక్షణ వివరించి తల్లి దండ్రులతో సెల్ఫీ కార్యక్రమాన్ని గురువారం పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు తదితర గ్రామాల్లో నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని అన్ని కేంద్రాల్లోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బాలికల సంరక్షణ, విద్యకు ప్రోత్సాహం గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శాంత కుమారి విమల, చంద్రకుమారి, నాగలక్ష్మి, మంగతాయారు, దేవి, జోత్స్న, సుబ్బలక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి

భీమవరం: ఇంగ్లీష్ భాషపై పట్టు సాధిస్తే ప్రపంచ స్థాయిలో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని అంతర్జాతీయ కార్పొరేట్ ట్రైనీ జార్జ్ జాన్ చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని పలు దేశాలు ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం కలిగి నిజాయితీతో పనిచేసే వారికి ఉద్యోగావకాశాలు కలిప్తున్నాయని తెలిపారు. కళాశాల ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్ వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ గ్లోబల్‌గా వస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు ఓరియంటేషన్ క్లాసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.